# ప్రకృతి ఒడిలో

“ఆయన ఏటిగట్టు ఇంజనీరుగారు, ఆయనభార్య. వారిమోటారుపై కిలుకకు నే నడ్డమగుటచే నన్నీడ్చివైచిరి. నేను చెవిటివాడనో, పిచ్చివాడనోయని యూహించి కాబోలును దొరగారు తిట్టారు, దొరసానిగారు హేళనములు ప్రసాదించారు.”

రచయిత :

## తురగా వెంకటరామయ్య

ప్రియమైన బావకు,

‘నావ్యవహారకాండమంతయు నీనడుమ దారుమారగుటచే నాల్గునెలలనుండియు మాయూరనే కాలక్షేపము జేయుచుంటినిగాని నేటేలకో నామనస్సంతయుఁ గలతనొందుటచే నుపశాంతికై నాయాత్మసీమ కేగితిని. అనుగ్రామమునందే; తిరిగినవీధినే తిరుగుచు మాట్లాడినచోటనే మాట్లాడుచు ఉదయమునుండి మధ్యాహ్నమువరకును వెఱ్ఱినై దిరిగితిని.

నా కబుర్లపటాటోపమునుబట్టియు, వేషభాషలనుబట్టియు నేనొక ప్రయోజకుడననియే కొందరు వయోవృద్ధులు నన్నుఁ బ్రశంసించిరిగాని నాదివాలాకోరుతనము నాగుండెలను లోపల నమిలివేయుచునేయున్నది. పయికిమాత్రమేమియు గనుపడనీయలేదు.

నాతలిదండ్రులు నా శైశవావస్థయందే గతించినను బుత్రప్రేమచే నాదరించిపెంచిన పినతల్లి ఇంకను జీవించియుండుటచే భోజనమామెయే పెట్టినది, పాప మామెప్రేమ అనిర్వాచ్యము; తాను పెంచినప్పటికంటె నేను చిక్కిపోయినందుల కామె కడుదుఃఖించినది. మారువడ్డించుకోనందుకు కోపముకూడా వచ్చినది. నాయుద్యోగమునుగురించియు, కోడలి పనిపాటలనుగురించియు, మనుమరాండ్ర ఆటపాటలను గురించియు ప్రశ్నపరంపరలను గ్రుమ్మరించినది. కాని నా హృదయవేదనాభారముచే తగు సమాధానములఁ జెప్పలేక ‘ఊఁ’ అనియో, ‘ఊహూఁ’ అనియో మౌనమునే వహించితిని. ఒక్కసంగతిమాత్ర మామె తీవ్రముగ చెప్పినది.

‘అబ్బాయీ! శారదాబిల్లు వచ్చిందట ప్రపంచమంతా అట్టుడికిపోతోంది. రెండోపిల్లకు నీయిష్టమువచ్చినట్టు చేసుకోవచ్చు. నేనప్పటికి బ్రతుక నేబ్రతుకను; పెద్దదానికి యెనిమిదేళ్లు వచ్చాయి గనుక ఈయేడు పెళ్ళిచేయక తప్పదు. నీకు తలిదండ్రులు లేరని స్వతంత్రించవద్దు. నేనింకా బ్రతికున్నా’’నని నవరసస్ఫూర్తిగా మందలించింది.

నాకేమీ తోచలేదు ఇపుడు చేయనని ఖండితముగ చెప్పిన చిన్నబోవును. చేయుదునన్నచో వెంటనే చేయుమని నిర్బంధించును. కావున ‘అదే ఆలోచించుచున్నాను. కట్నములతో ప్రపంచము తగులబడిపోవుచున్నది. బోలెడు డబ్బుకావలెను. అదీగాక ఏదో వచ్చిందని తొందరపడి ఎవనికో ముడిబెట్టితిమా బ్రతికినంతకాల మాపిల్ల దుఃఖించును. మంచి సంబంధము కొరకే చూచుచుంటి’నని లౌక్యముగ తప్పించుకొంటిని.

నేను వచ్చినపనియొకటి, జరుగుచున్నది ఇంకొకటి. ఈప్రసంగము నాకు రుచించునా ?

ఇంతలో సాయంకాలమైనది. ఎండ చల్లారినదికాని నాహృదయాంతర్భూతవేదనాగ్ని చల్లారలేదు. నాజీవితమునకు పరమావధియని నమ్మినమార్గము నానాటికి దూరమగుచుండుటచే జీవించుటే హేయమనిపించుచున్నది; తలవని తలంపుగఁ గష్టములు పైబడుచునే యున్నవి. శోకములు బంధించుచునే యున్నవి; లోకములు బెదరించుచునే యున్నవి ; నా ఆశయము క్షీణించుటలేదు. మార్గము దొరుకుటలేదు. స్వీయప్రజ్ఞపై నమ్మకముపోయినది; అన్నిపనులు వదలుకొంటిని. ఈస్థితిలో నాకేమిప్రపంచము ? ఒక్క నిట్టూర్పుతో బయలుదేరితిని*; అరటితోటలలో నడచితినో, కొబ్బరితోటలలో దిరిగితినో, వరిపొలాలగట్టులయందు పడి లేచితినో ఏమియు నాకు దెలియలేదు. ఒకొక్కకమారు కన్నీటి దొంతరలు మార్గావరోధము చేయుచుండెను. ఒకొక్కకతరి సంతోషముతో మై లొంక అంగయనుచుండెను.

ఈనిమ్నోన్నతావస్థలలో గోదావరి తీరమునకు జేరితిని. బాల్యమున నేనాడుకొనినచోటులన్నియు నొక్కమారు న

న్నాదరించినవి మాజనయిత్రి 'గోదావరి' విమలవాయుడోలికలో నూగించి కోకిలకంఠియయి జోలలు బాడినది. పసిబాలుడనై నోట వ్రేలుంచుకొని ప్రకృతిలో నాడితిని. నాతో ఆడుకొనుటకే కాబోలు నెలబాలుడుకూడ నమృతసుందరుడై దయచేసెను. ధనశూన్యుడైన మహాదాత చందమున నేటికి జీవనరహితయయి బయలుపడినదయ్యు గోదావరీతరంగిణి తన చిన్నికెరటములతోడనే కళాపూర్ణు నాహ్వానించుచున్నవి. ఇసుకతిన్నెలు వెండిబంగారు రాసులవలె మెఱయుచున్నవి; చివురించిన మామిడితోటలు పురంధ్రీరమణులై కనుల పండువు సేయుచున్నవి; వర్ణించు టెందులకు? సృష్టికి నూత్నశోభ వచ్చినది: కల్యాణమందిరమైనది; అవిలాసము చూచి తీరవలెను; ఒక వైపున భగవన్నిర్మితయగు జీవవాహినియు, రెండవ వైపున మానవశక్తినిర్మితమగు కాలువయు నడుమ నున్నతమగు నేటిగట్టును, ఆగట్టుపై సుఖదుఃఖ వివేచనావమగ్నుడనై, కర్తవ్యతామూఢుడనైయున్న నేను, నాయున్మత్తతకు నవ్వుచు నెదుటఁ జలతరంగిణితో దాండవించే చంద్రుడు. ఏమిదృశ్యమోయి? నాచిత్తస్థితులకు భంగము కలిగించుట కేమానవవ్యక్తియు నాదాపున లేకుండుటయు నాభాగ్యమే; కొంతదూరమున నేటినడుమనున్న లంకలో జొన్నకళ్ళముల కాపలాకాయు నాతడు కాబోలు నీదృశ్యమున దన్మయుడై 'నీకూ నీవారూ లేరు—నాకూ నావారూ లేరు- ఏటియొడ్డున మేడగడదాం పదరా-! యని తీవ్రముగ పాడుచున్నాడు. కాలువలో పోవు పడవలోనివాడై యుండనోపు ఎవరో జిజ్ఞాసువు 'అంతా రామమయ మ్మీజగ-మంతా రామమయ మ్మని శ్రావ్యముగ బాడుచున్నాడు. పడవను లాగువాండ్రా పాటకు ముక్వాలకర్రలతో లయవేయుచున్నారు. తన్మయుడనై వినుచు నేయున్నాను.

బావా! ఏమిచెప్పను? చింతాసముద్రములో మునిగియున్న నామనోమందిరమునఁ దళుక్కున నొక విద్యుజ్జ్యోతి వెలిగినది. ఆ ఆనందమునకు మేర లేదు వెనుకముందు నాఅన్నవారు లేరు. మన మాయేటియొడ్డున మేడగట్టుదము. అదియే మన పరమావధియని ప్రేమైకస్వరముతో నన్ను పిలిచినవారెవరు? ఎవరు? అని యరచుచు కన్నులు దెరచితిని; ఎవరును లేరు? పరమశాంతస్వరూపిణియుఁ గల్యాణియునగు ప్రకృతియున్నది. మణిభూషణాలంకృతయయి, చంద్రికాదుకూలధారిణియయి, జలజనేత్రయయి, కోకిలకంఠియయి నాయెదుటఁ దాండవించుచున్నది. ప్రేమగానముల బాడుచున్నది. రసోపాసకుడనగు నాయాత్మ నాకు తోచినది. ఈజీవితమే దివ్యతరంగిణి. సౌధము నిర్మింపుము నీవు పాటకుడవైతివా నేను నర్తకినై తాండవింతును. నీవు కవివగుదువా నేను కళనై వెలింగెదను. నీవు యోగివగుదువా నేను సాధననై విజృంభింతును. నీవు ఈశ్వరుడవైతివా నేను శక్తినై నీలో కరగిపోదును. అవినాభావములగు మనతత్వములు విడినవి. వేరైనవి. పరిభ్రమణము నొందుచున్నవి. పడిపోవుచున్నవి. నన్ను లాలింపుము; ప్రేమింపుము; ఆత్మానుసంధాన మొనర్పుము. రసబ్రహ్మము నుపాసింపుము. జగద్రూపిణినగు నన్ను నీలోగలుపుకొని రసస్వరూపుడవుగమ్ము. జగత్తంతయు నీమయమై వెలుంగును. అంతా రామమయమ్మని పాడుకొగలవని యేమో యుపన్యసించుచున్నది. నేను తన్మయుడనై సర్వము మరచి నిలుచుంటిని.

ఇంతలో హఠాత్తుగా నెవరో నన్ను జెబ్బదొరకబుచ్చుకొని గట్టుక్రిందికీడ్చుట నేను కలతనిద్రలో మేలుకొన్నవానివలె చూచుసరికి ఒక మోటారుసైకిలులో నిరువురు స్త్రీపురుషులు ఆంగ్లేయులు ప్రత్యక్షమైనారు. కారణము దెలిసిపోయినది. ఆయన ఏటిగట్టు ఇంజనీరుగారు, ఆయన భార్య. వారి మోటారుసైకిలునకు నేనడ్డమగుటచే నన్నీడ్చివైచిరి. నేను చెవిటివాడనో, పిచ్చివాడనోయని యూహించి కాబోలును దొరగారు తిట్టారు, దొరసానిగారు హేళనములు ప్రసాదించిరి. ఊఁ జీవనములే క్షణభంగురములు; ఉద్యోగములును, విద్యుచ్ఛకటములును శాశ్వతములా? యని నేను నవ్వుకొంటిని.

రేపటినుండి యెటులుండునో గాని నేడుమాత్రము కోటీశ్వరునకున్నంత సంతోషమున్నది. నాలో ప్రకృతియు' ప్రకృతిలో నేనును కలిసిపోయినాము. ఈ ఆనంద మెంతకాలముండునో చెప్పజాలను. ఏమయిన నేమి? నిర్మలానంద మొకక్షణము జాలదా? నీవు వేలకొలది ధనమును వ్యయపరచి ఆమలబారుతీరమున చదువుచుంటివి. ఆపరీక్షలగువరకు మాత్రము తత్వవిచారములో దిగకుము. ''పట్టా'' వచ్చినతర్వాత వ్యాజ్యములు వచ్చేవరకు గొన్నియేండ్లు ''ఖాళీ''గా నుందువుగాన తత్వవిచారమో మఱియొకటియో జేసుకొనవచ్చును. నేడింతకంటె నేమియు వ్రాయజాలను. క్షమింపుము.

నీ బావ

ఆనందుడు.